సాక్షి చిత్తూరు

సోమవారం, 23, సెప్టెంబర్, 2024



పసిబిడ్డ శవంతో బాధితుల ధర్నా

నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్‌ను అరెస్టు చేయాలని బాధితులు పసిబిడ్డ శవంతో ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. - 8లో



సత్తా చాటి.. పతకాలు పట్టి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లోనూ రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారు. - 8లో



ఉపాధిలో అతనే డాన్

గుడిపాల మండలంలో ఉపాధి హామీ జూనియర్ ఇంజినీర్ అన్నీ తానై చెలరేగిపోతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

2 టన్నుల కూరగాయలు వితరణ



కూరగాయలు అందజేస్తున్న శ్రీకాంత్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి ఆదివారం కర్ణాటక రాష్ట్రం హోసూర్‌కు చెందిన శ్రీకాంత్ సుమారు 2 టన్నుల కూరగాయలను వితరణ చేశారు. వాటిని ఆలయ అధికారులకు అందించారు. కార్యక్రమంలో అన్నదాన సూపరింటెండెంట్ బాలరంగస్వామి, మునిరామయ్య పాల్గొన్నారు.

27న పుత్తూరులో ఉద్యోగ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 27వ తేదీన తిరుపతి జిల్లా పుత్తూరులో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధికల్పనా కార్యాలయం, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. పదవ తరగతి నుంచి డిగ్రీ, ఆపైన చదువులు చదివి, 18 నుంచి 35 ఏళ్లలోపు వారు ఇంటర్వ్యూల్లో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 6300954441, 7993502145 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వాణిజ్య పన్నుల శాఖలో అధికారుల బదిలీలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా వాణిజ్య పన్నుల శాఖలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కమిషనర్ భానుప్రకాష్‌ను విజయవాడ రీజనల్ కార్యాలయానికి బదిలీ చేయగా ఆయన స్థానంలో విజయవాడ హెడ్ ఆఫీసు నుంచి విజయభాస్కర్ రానున్నారు. పలమనేరు సహాయ కమిషనర్ రవికుమార్‌రెడ్డిని ప్రొద్దుటూరు-2కు మార్చారు. ఆయన స్థానంలో మదనపల్లె నుంచి శ్రీనివాసరావును నియమించారు. అదేవిధంగా ఆరుగురు డీసీటీఓలు, 12 మంది ఏసీటీఓలు, 12 మంది ఏఈఓలు, 16 మంది ఈటీఏలు బదిలీ అయ్యారు.



యథేచ్ఛగా పచ్చ లాటరీలు!

- స్మార్ట్ ఫోన్లు, యాప్‌లతో ఆన్‌లైన్‌లో లావాదేవీలు
- మరికొన్ని చోట్ల నంబర్ల ఆట, కాటన్ లక్కీ మాయ
- తమిళనాడు ముఠా ఆదేశాలతో పనిచేస్తున్న ఇక్కడి ఏజెంట్లు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- అధికారం అండతో రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు

పలమనేరు:చిత్తూరు జిల్లాలోని పలమనేరు, కుప్పం, చిత్తూరు, నగరి, పుత్తూరు నియోజకవర్గాలు తమిళనాడు రాష్ట్రానికి ఆనుకుని ఉన్నాయి. తమిళనాడులో లాటరీ వ్యాపారంలో ఆరితేరిన ముఠాలు ఆంధ్రాలోని ప్రాంతాల్లో ఏజెంట్లుగా స్థానికులను నియమించుకుని కేరళ ఆన్‌లైన్ లాటరీ పేరిట దందాను నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. పలమనేరు పట్టణంలోనే లాటరీ ఏజెంట్లు 20 మంది వరకు ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరికి పట్టణానికి చెందిన ఓ టీడీపీ యువనేత అండ ఉండడంతో ఇబ్బంది లేకుండా వ్యవహారం సాగిపోతోంది. ఇక జిల్లాలోని సరిహద్దు పట్టణాల్లో వందలాది మంది ఏజెంట్లు నిత్యం ఇదే పనిలో ఉన్నట్టు సమాచారం. ఆయా ప్రాంతాలకు చెందిన కూటమి నేతలు అండగా ఉంటూ వారి నుంచి మామూళ్లు తీసుకుంటూ పోలీసులను సైతం తమ గుప్పెట్లో పెట్టుకున్నట్టు తెలుస్తోంది.

కాటన్, రాజా లాటరీలు

ముందుగానే కొన్ని లక్కీ నంబర్లను ఎంపిక చేసుకొని ఆపై వేలల్లో నంబర్లను విక్రయిస్తారు. ఇందులో రూ.10లకు రూ.500, రూ.50లు కడితే రూ.5 వేలు, రూ.100లకు రూ.10 వేలు, రూ.1000లకు రూ.లక్ష ఇస్తామని చెప్పి నంబర్లను విక్రయిస్తారు. ఏ పూటకాపూట ఒకరిద్దరికి లాటరీ కొట్టిందని డబ్బులిచ్చి చాలా మందిని ఈ ఊబిలోకి లాగుతున్నారు. దురాశకు వెళ్లి ఇందులో నంబర్లు కొన్న వారికి చివరికి ఏమీ రాక తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలా లక్షల్లో నగదు వసూలు చేసి వేలల్లో ప్రైజ్‌లను తక్కువ మొత్తంలో ఎక్కువ మందికి ఇస్తూ తెలివిగా మోసం చేస్తున్నారు. వీటిని ఎక్కువగా దినసరి కూలీలు, లారీ, ఆటో డ్రైవర్లు, మండీల్లో పనిచేసే వారు, కార్మికులు కొనుగోలు చేస్తున్నారు.

రోజుకు లక్షల్లో వ్యాపారం

ఈ లాటరీ వ్యాపారం ఎక్కువగా జరిగే పట్టణాల్లోని కిరాణా దుకాణాలు, టీ కొట్లు, పాన్‌షాపులు, ఆటో స్టాండ్లు, కూలీలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని క్రాస్‌లలో ఏజెంట్లు అమ్మకాలు చేస్తుంటారు. ఆన్‌లైన్‌లో లాటరీకి ఎక్కువగా మధ్య తరగతికి చెందిన వారే కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోనే 200 మంది దాకా ఏజెంట్లు లాటరీని నిర్వహిస్తున్నట్టు సమాచారం. రోజుకి రూ.80 లక్షల వరకు లాటరీ వ్యాపారం సాగుతోందంటే ఈ దందా ఎంతలా నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఏదేమైనా గట్టుచప్పుడు కాకుండా పేదలను అప్పుల పాలు చేస్తున్న ఈ లాటరీ ముఠాలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. పోలీసు అధికారులు ఇటీవల బదిలీపై జిల్లాకు రావడంతో దీనిపై వారికి అవగాహన ఉండడం లేదు.

రకరకాలుగా లాటరీలు

కేరళ రాష్ట్రంలో లాటరీలపై నిషేధం లేదు. అక్కడ వందల సంఖ్యలో ఆన్‌లైన్ లాటరీలు స్మార్ట్‌ఫోన్ సాయంతో నడుస్తున్నాయి. ఇదే తరహాలో తమిళనాడులోని గుడియాత్తం, వేలూరు, ధర్మపురి, క్రిష్ణగిరి, తిరప్పత్తూర్, షోలింగర్, తిరుత్తణికి చెందిన ముఠాలు మన జిల్లాలో లాటరీలను నిర్వహిస్తున్నారు. ఈ వ్యాపారం రహస్య కోడ్ల ఆధారంగా సాగుతోంది. కారుణ్య ప్లస్ అయితే(కేఎన్-447), నిర్మల్ (ఎన్ఆర్-304), విన్‌విన్(డబ్ల్యూ-695), శ్రీశక్తి (ఎస్ఎస్-341) లాంటి పేర్లతో వీక్లీ, డైలీ, ప్రతి మూడు గంటలకోసారి, గంటసేపే లాంటి లాటరీలున్నాయి. వీటి ధర రూ.40 నుంచి రూ.500 వరకు ఉంటుంది. ఎవరైనా లాటరీ నంబరు కావాలంటే స్థానిక ఏజెంట్‌కు డబ్బులివ్వగానే ఓ కోడ్ చెబుతాడు. తీసుకున్న కోడ్‌కు ఎప్పుడు రిజల్ట్ వస్తుందో అప్పుడు ఏజెంట్ దాన్ని ప్రకటిస్తాడు. ఇదంతా ఆన్‌లైన్ యాప్ ద్వారా జరుగుతుంది. ఫలితం వచ్చిన పది నిమిషాల్లో ఎవరికి లాటరీ తగిలిందో తెలిసిపోతుంది. సింగిల్ డిజిట్ లాటరీలను సైతం జిరాక్స్ చేసి వాటిపై నంబర్లు వేసి రహస్యంగా విక్రయిస్తున్నారు.



రకరకాల పేర్లు, కోడ్‌లతో సాగే లాటరీలు



AB 485537(ADDOR)

3rd Prize-Rs :100000/-

AA 663686 AB 913102
AC 224519 AD 575299
AE 474390 AF 586687
AG 196330 AH 509397
AJ 185268 AK 737438
AL 254029 AM 748593

4th Prize-Rs :5000/-

0030 1006 1515 1621 2529 3356
3451 5353 5910 6438 6803 7036
7104 8360 8461 8717 8733 9526

5th Prize-Rs :2000/-

2608 3902 5032 6867 7168 8544 9011

యాప్‌లో రోజు వారీ ఫలితాలు ఇలా

26న పీఎంఈజీపీపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం (పీఎంఈజీపీ)పై ఈ నెల 26న కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు పీఎంఈజీపీ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు హాజరుకావొచ్చని సూచించారు. ఈ పథకం కింద వస్తువుల తయారీ పరిశ్రమలు నెలకొల్పేందుకు రూ.50 లక్షల వరకు రుణం అందజేస్తారని తెలిపారు. వివరాలకు ఏపీ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి 9440814613, 9849612989లో సంప్రదించాలని తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరులోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఇందులో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. అధికారులు కార్యక్రమానికి గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. ప్రజలు నేరుగా తనను కలిసి తమ సమస్యల గురించి మాట్లాడవచ్చని పేర్కొన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.

కామధేనువుపై విఘ్నేశ్వరుడి విహారం



వాహన సేవలో అధికారులు, ఉభయదారులు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు కామధేనువుపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తెల్లవారుజామునే స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి స్వామి వారు కామధేనువు వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ముందుగా అలంకార మండపంలో శ్రీసిద్ధి బుద్ధి సమేత వినాయస్వామి ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పరిమళ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి కామధేనువు వాహనంలో అధిష్టింపజేశారు. మంగళవాయిద్యాలు, మేళాతాళాలు, కోలాటాలు, భజన బృందాల ప్రదర్శనల నడుమ ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈవో గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు సూర్యప్రభ వాహనం

కాణిపాకం ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వినాయక స్వామి వారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతారని ఆలయ ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఉదయం అభిషేకం, రాత్రి సూర్యప్రభ వాహనం ఉంటాయని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

భక్తులతో పోటెత్తిన బోయకొండ



ఆలయంలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

చౌడేపల్లె:మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, జంతు సంపద వృద్ధి చెందాలని ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనె దీపాలు, దివ్వెలతో మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఇసుకను దోచేస్తున్న అక్రమార్కులు

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అక్రమార్కులు కూటమి నేతల అండతో రాత్రీపగలు తేడా లేకుండా ఇసుకను తరలిస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో ఇసుక అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ముఖ్యంగా గంగాధరనెల్లూరులోని నీవానది నుంచి పెద్ద ఎత్తున ఇసుకను తవ్వుతుండడంతో వంతెన కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు.

- రాత్రీపగలు తేడా లేకుండా రవాణా
- రూ.కోట్లు ఆర్జిస్తున్న వైనం
- పట్టించుకోని ప్రభుత్వాధికారులు
- నీవా నది వంతెనకు పొంచి ఉన్న ప్రమాదం

సాక్షి టాస్క్ ఫోర్స్: మండల కేంద్రమైన గంగాధర నెల్లూరు సమీపంలో నీవానది ప్రవహిస్తోంది. ఇందులో నాణ్యమైన ఇసుక ఉంది. దీనిపై కూటమి నేతల కన్ను పడింది. దీంతో కొద్దిరోజులుగా యంత్రాలతో వంతెన కింద, సమీపంలో, వంతెన చుట్టుపక్కల ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.2000 వేలకు విక్రయిస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. నీవానది వంతెన పైనుంచి మండల, జిల్లా అధికారులు నిరంతరం వెళుతుంటారు. ఇసుక అక్రమ రవాణా కనిపిస్తున్నా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి చెందిన కొందరు నేతలు అధికారులను తమ చేతిలో ఉంచుకుని, లేకుంటే బెదిరిస్తూ దర్జాగా ఇసుకను దోచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన బ్యానర్‌ను చింపేసిన ఇసుకాసురులు

నీవా నది వంతెనకు పొంచి వున్న ప్రమాదం

పెద్ద ఎత్తున ఇసుకను తవ్వేడంతో నీవానదిపై ఉన్న వంతెన ప్రమాదంలో ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గత సంవత్సరం అధిక వర్షాలతో ఏరు సాగడంతో నీవానదికి రెండు మూలల కోతకు గురైంది. అంతేగాక వంతెన ఒకవైపు పాక్షికంగా దెబ్బతినడంతో మరమ్మతులు చేశారు. వంతెన కింద ఇసుకను తోడేయడంతో ఈసారి వరదలు వస్తే వంతెన కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

నీవా నది వంతెన సమీపంలోనూ తవ్వేసిన ఇసుక



క్లుప్తంగా

చిరు వ్యాపారులపై పోలీసుల ప్రతాపం

కుప్పం: పట్టణంలో రోడ్డుపై తోపుడు బండి మీద చిరువ్యాపారం చేసుకుంటున్న వారిపై పోలీసులు ప్రతాపం చూపించారు. రాత్రి శనివారం రాత్రి పది గంటలు అవుతున్నా దుకాణాలు మూయలేదని ఒక వ్యక్తిని చితకబాదారు. అనంతరం పోలీసు వాహనంలో పట్టణం బయటకు తీసుకెళ్లి 5 కిలో మీటర్ల దూరంలో వదిలిపెట్టారు. అతను 5 కిలో మీటర్లు నడుచుకుంటూ కుప్పం చేరుకున్నాడు. బాధితుడి కథనం మేరకు.. పట్టణంలోని పలురోడ్లలో కొంతమంది చిరువ్యాపారులు తోపుడు బండ్లపై అరటి పండ్లు విక్రయించుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇందులో భాగంగానే కొత్తపేటకు చెందిన టీడీపీ యువ నాయకుడు అప్పు చిన్నాన్న కుమారుడు మురుగేష్ (20) బస్టాండులో అరటి పండ్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో అర్బన్ సీఐ జీటీ నాయుడు తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. దుకాణాలను మూసివేయాలని చెప్పారు. 10 గంటలకు బెంగళూరు నుంచి రైలు వస్తుందని, ప్రయాణికులను చూసుకుని దుకాణాలను మూసివేస్తామని మురుగేష్ సీఐని కోరాడు. దీంతో సీఐ ఆవేశంతో ఊగిపోయారు. మురుగేష్‌ను చితకబాదారు. అనంతరం పోలీసు వాహనంలో ఎక్కించుకుని 5 కిలోమీటర్లు దూరంలోని లక్ష్మీపురంలో వదిలేశారు. మురుగేష్ అక్కడి నుంచి నడుచుకుంటూ వచ్చి ఇల్లు చేరాడు. ఈ విషయాన్ని అధికార పార్టీ నేతల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి రాత్రి 10 గంటలకు వరకు దుకాణాలు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు రాత్రి 9 గంటలకే మూసివేయాలని ఆంక్షలు విధించడం తగదని వారు అంటున్నారు. చిరువ్యాపారులకు న్యాయం చేయకపోతే పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తామని చెబుతున్నారు.

రూ.15 లక్షల టపాకాయల స్వాధీనం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఆదివారం పోలీసులు పెద్ద ఎత్తున టపాకాయలను స్వాధీనం చేసుకున్నారు. వన్ టౌన్ సీఐ జయరామయ్య కథనం మేరకు.. చిత్తూరు నగరంలోని పలుచోట్ల అనుమతులు లేకుండా టపాకాయలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. చర్చి వీధి మార్కెట్ చౌక్ ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. దేవరాయల రెడ్డి వీధికి చెందిన వేణు తన నివాసంలో పెద్ద ఎత్తున టపాకాయలు నిల్వ చేసినట్టు గుర్తించారు. దాదాపు రూ.15 లక్షల విలువైన టపాకాయలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

సత్తా చాటి.. పతకాలు పట్టి

ప్రోత్సాహం అందిస్తే విద్యలోనే కాకుండా క్రీడల్లోనూ సత్తా చాటి పతకాలు సాధిస్తామని గ్రామీణ ప్రాంత విద్యార్థులు నిరూపిస్తున్నారు. ఒత్తిడిని అధిగమించి, గాయాలకు భయపడకుండా క్రీడల్లో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపుతూ పతకాలు సాధిస్తున్నారు. ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) పోటీల్లోనూ ప్రతిభ చూపి పతకాలు సాధించారు.

– నగరి


బాల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

- జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ముగ్గురు ఎంపిక
- ఎస్‌జీఎఫ్ క్రీడల్లోనూ ప్రతిభ చూపి పతకాలు సాధించిన వైనం

సాధారణంగా ప్రతి ఒక్కరిలోనూ బాల్యం నుంచే ఏదో రంగంపై ఆశక్తి ఉంటుంది. దాన్ని సరైన సమయంలో గుర్తించి మంచి శిక్షణ ఇస్తే జాతీయ స్థాయికి ఎదుగుతారనడంలో అతిశయోక్తి లేదు. సరిగ్గా ఇదే నిరూపించారు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు. ప్రాథమిక స్థాయి నుంచి బాల్ బ్యాడ్మింటన్ క్రీడపై ఉన్న ఆసక్తిని గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయులు వారిని సానబెట్టడంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోను రాష్ట్రం తరపున పాల్గొని చక్కని ఆటతీరును ప్రదర్శించి రాష్ట్రాన్ని విజేతగా నిలిపారు. పతకాలు దక్కించుకున్నారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చేపడుతున్న ప్రత్యేక చర్యల ద్వారా ఉమ్మడి జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడ పుంజుకుంటోంది. ఇటీవల కాకినాడ జిల్లా అన్నవరంలో నిర్వహించిన అంతర్ జిల్లాల సబ్ జూనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. ఈ నెల 25వ తేదీ నుంచి హర్యానా రాష్ట్రం, రోథక్‌లో నిర్వహించే జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఏపీ జట్టు తరపున పాల్గొంటున్నారు. వీరంతా.. సామాన్య, మధ్య తరగతికి చెందిన వారే కావడం విశేషం. ఒక వైపు చదువుకుంటూ మరోవైపు ఆటల్లో రాణిస్తున్నారు.

క్రీడాకారులకు అత్యున్నత ప్రోత్సాహం



జిల్లా నలుమూలలా బ్యాడ్మింటన్ క్రీడాకారులు సాధన చేస్తున్నారు. సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. పోటీలు ఎక్కువగా నిర్వహిస్తుండడంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అవకాశం లభిస్తోంది. ఈ ఏడాది అంతర్ జిల్లాల పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు తమ ప్రతిభతో ముగ్గురు క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎంపిక కావడం విశేషం. వారికి తగిన ప్రోత్సాహం అందిస్తున్నాం. రాష్ట్ర జట్టును జాతీయ స్థాయిలోను ప్రథమ స్థానంలో నిలపడంలో క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తారన్న నమ్మకం ఉంది.

– బాలాజీ, ప్రధాన కార్యదర్శి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్

స్టార్ ఆఫ్ ఇండియా సాధిస్తానంటున్న తేజేష్



నగరికి చెందిన తేజేష్.. ప్రస్తుతం ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. వ్యాయామ ఉపాధ్యాయులు గోపి సహకారంతో బాల్ బ్యాడ్మింటన్ నేర్చుకున్నాడు. అప్పటి నుంచి నిరంతర సాధన చేస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతున్నాడు. 2021, 2023లో జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికై రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలపడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ఏడాది రాష్ట్ర స్థాయి పోటీల్లో స్టార్ ఆఫ్ ఆంధ్రాగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హర్యానా రోథక్‌లో నిర్వహించే జాతీయ స్థాయిలో పోటీలో పాల్గొననున్నాడు. స్టార్ ఆఫ్ ఇండియాగా రాణించాలన్నదే తన లక్ష్యమని చెబుతున్నాడు.

బాలికల విభాగంలో సత్తా చాటుతున్న ప్రశాంతి



తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం, అక్కగారిపేటకు చెందిన ప్రశాంతి శ్రీకాళహస్తిలోని బీపీ అగ్రహారంలో ఉన్న ఒక ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. బాల్ బ్యాడ్మింటన్‌పై మక్కువతో చిన్నతనం నుంచి శిక్షణ పొందింది. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పలుమార్లు పతకాలు సాధించింది. గత ఏడాది జాతీయ స్థాయి పోటీలో పాల్గొంది. ప్రస్తుతం అన్నవరంలో నిర్వహించిన అంతర్ జిల్లాల సబ్ జూనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలో ప్రతిభ చూపి స్టార్ ఆఫ్ ఆంధ్రా సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. హర్యానాలోని రోథక్‌లో జరిగే 43వ జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ పోటీల్లో పాల్గొననుంది.

రాష్ట్ర జట్టును విజయపథంలో నిలుపుతానంటున్న హేమ్‌చరణ్



శ్రీకాళహస్తి పానగల్‌కు చెందిన హేమ్ చరణ్ మూడేళ్లుగా బాల్ బ్యాడ్మింటన్ అండర్ 14లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నాడు. గత ఏడాది అండర్ –14 రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాడు. ప్రస్తుతం అన్నవరంలో జరిగిన అంతర్ జిల్లాల పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హర్యానాలోని రోథక్‌లో జరిగే 43వ జాతీయ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొననున్నాడు. రాష్ట్ర జట్టును విజయపథంలో నిలపడమే లక్ష్యమని తెలుపుతున్నాడు.

బెస్ట్ ప్లేయర్ అవార్డు పొందిన లక్ష్మీనరసింహ



చిత్తూరు జిల్లా నగరి మండలానికి చెందిన లక్ష్మీనరసింహారెడ్డికి చిన్నతనం నుంచి బాల్‌బ్యాడ్మింటన్ అంటే మక్కువ. మూడేళ్లుగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో సత్తా చాటుకుంటున్నాడు. గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్ –14 క్రీడల్లో రాణించి బెస్ట్ ప్లేయర్ ఆఫ్ టోర్నమెంట్ అవార్డు అందుకున్నాడు. ప్రస్తుతం బాల్ బ్యాడ్మింటన్ అసోసియేసన్ నిర్వహించిన అంతర్ జిల్లాల పోటీల్లో ప్రతిభ చూపి బెస్ట్ అప్‌కమింగ్ ప్లేయర్ అవార్డు పొందాడు.

రఘురామ, నానాజీపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలి


మాట్లాడుతున్న అశోక్, శ్రీనివాసులు

పుంగనూరు: పశ్చిమగోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎన్ఆర్.అశోక్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వినాయక మండపం ఎదురుగా కట్టిన అంబేద్కర్ బ్యానర్‌ను చింపేడంతోపాటు దళిత కులానికి చెందిన వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావును కులం పేరుతో దూషించి, కొట్టించారని ఆరోపించారు. వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వీరిని ఎమ్మెల్యేలుగా బర్తరఫ్ చేయాలని కోరారు. అంబేడ్కర్ రిజర్వేషన్లతో గెలుపొందిన ఎమ్మెల్యేలు ఆయనను అవమానించడం, అడ్డు వచ్చిన వారిపై దాడులు చేయడం దారుణమని తెలిపారు. దీనిపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో దళిత నాయకులు శ్రీనివాసులు, ఈశ్వర్, భాస్కర్, మంజు, నాగ తదితరులు పాల్గొన్నారు.

1.8 కేజీల గంజాయి స్వాధీనం

– ఒకరి అరెస్ట్



నిందితుడు శేఖర్‌తో పోలీసులు

నగరి : నగరి మున్సిపాలిటీ పరిధిలోని కీళపట్టు బైపాస్ మలుపు ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో గంజాయి తరలిస్తున్న కె.శేఖర్ (54) అనే వ్యక్తిని సీఐ మహేశ్వర్ ఆదివారం అరెస్ట్ చేశారు. అతని నుంచి 1.8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలతో కలిసి వాహనాలను తనిఖీ చేశామన్నారు. తమిళనాడు అంబత్తూర్‌కు చెందిన కే.శేఖర్ స్కూటీలో వస్తుండగా పరిశీలించినట్టు తెలిపారు. అతని వద్ద 1.8 కేజీల గంజాయి ఉన్నట్టు గుర్తించామన్నారు. గంజాయి, స్కూటీ, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని నిందితుని రిమాండ్‌కు పంపినట్టు వెల్లడించారు.

జెడ్పీ సీఈఓగా రవికుమార్‌నాయుడు

– డీపీఓగా నాగేశ్వర్‌నాయక్


రవికుమార్‌నాయుడు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ సీఈఓగా రవికుమార్‌నాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం వెంకటగిరి క్లస్టర్ డ్వామా ఏపీడీగా పనిచేస్తున్నారు. డిప్యూటీ సీఈఓగా వైఎస్సార్ జిల్లా మైదుకూరు డీఎల్‌డీఓ జుబేదాను నియమించారు. సీఈఓ గ్లోరియా, డిప్యూటీ సీఈఓ ఆదిశేషారెడ్డిని చీఫ్ పంచాయతీరాజ్‌కు రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. కృష్ణా జిల్లా డీపీఓ నాగేశ్వర్‌నాయక్‌ను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జి డీపీఓగా ఉన్న లక్ష్మి ఆమె పాతస్థానం డీఎల్‌పీఓగా కొనసాగనున్నారు. పంచాయతీరాజ్ ఎస్ఈగా తిరుపతి జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఆఫీసర్‌గా ఉన్న శంకర్‌నారాయణ నియమితులయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎస్ఈగా ఉన్న పి.చంద్రశేఖర్ రెడ్డిని వైఎస్సార్ జిల్లా ఈఈగా బదిలీ చేశారు.

జిల్లా సర్వే శాఖ ఏడీగా జయరాజ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా టి.జయరాజ్ నియమితులయ్యారు. ఆయన అన్నమయ్య జిల్లా నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న గౌస్‌బాషాను ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. గౌస్‌బాషా జిల్లాలో ఏడాదికి పైగా విధులు నిర్వహించారు. అదేవిధంగా జిల్లా డీఆర్‌డీఏ శాఖ పీడీ డీఎంకే.తులసిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఫారిన్ సర్వీస్‌లో డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్న ఆమెను మాతృసంస్థ కమర్షియల్ ట్యాక్స్‌కు పంపింది. అనంతరం నెల్లూరు జిల్లా కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఆమె స్థానంలో ప్రభుత్వం ఎవ్వరినీ నియమించలేదు.

తహసీల్దార్ల బదిలీ

జోన్ 4 పరిధిలోని తహసీల్దార్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ శ్రీకేష్‌లత్కర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హమీద్ బాషాను చిత్తూరు జిల్లాకు, చిత్తూరు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న లోకేశ్వరరావును కర్నూలుకు బదిలీ చేశారు. అలాగే తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న దస్తగిరయ్యను వైఎస్ఆర్ కడప జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ట్రాన్స్‌కోలో 32 మంది..

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో 32 మంది క్షేత్ర స్థాయి ఉద్యోగులను బదిలీ చేస్తూ ఈఈ మునిచంద్ర ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో లైన్ ఇన్‌స్పెక్టర్లు ఐదుగురు, లైన్‌మెన్లు 27 మంది, సహాయ లైన్‌మెన్లు 10 మంది ఉన్నారు.

పలువురు సబ్‌రిజిస్ట్రార్లు..

స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్‌గా అశోక్, చిత్తూరు రూరల్‌కు ఆనందన్, కార్వేటినగరానికి సత్యప్రసాద్, కుప్పానికి సత్యనారాయణ, బంగారుపాళ్యానికి యోగానందం, పలమనేరుకు సుబ్రహ్మణ్యం, పుంగనూరుకు సర్వేశ్వరరెడ్డి నియమితులయ్యారు. చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న రహంతుల్లాను తిరుపతి జిల్లాలోని పాకాల సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు.

హెల్మెట్ తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఉత్తర్వులు జారీచేశారు. నో హెల్మెట్–నో అడ్మిషన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ మేరకు ఆయా శాఖల జిల్లా అధికారులు తమ శాఖలోని కింది స్థాయి ఉద్యోగులు కచ్చితంగా హెల్మెట్ ధరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పసిబిడ్డ శవంతో బాధితుల ధర్నా

– డాక్టర్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్

పుంగనూరు : బిడ్డ చనిపోయినా వైద్యం చేసినట్టు నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్ కార్తీక్‌రాజ్‌ను అరెస్ట్ చేయాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. వారు ఆదివారం బిడ్డ శవంతో కార్తీక్ ఆస్పత్రి వద్ద బైఠాయించారు. పుంగనూరు పట్టణం నక్కబండకు చెందిన బాలు, వినీల దంపతుల కుమారుడు సాత్వీక్‌నంద (10 నెలలు) దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతుండడంతో గత వారం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న కార్తీక్ చిన్నపిల్లల ఆస్పత్రిలో చేర్చారు. డాక్టర్ కార్తీక్‌రాజ్ ప్రతి రోజూ చికిత్స పేరుతో రూ.వేలకు వేలు వసూలు చేశారు. శనివారం సాయంత్రం బిడ్డ చనిపోయినా పరిస్థితి బాగాలేదని పేర్కొని మదనపల్లెకి రెఫర్ చేశారని బాధితులు ఆరోపించారు. ఈ మేరకు రాత్రి సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆదివారం కుటుంబ సభ్యులు బిడ్డ శవం పెట్టుకుని ధర్నా చేశారు. దీనిపై ఇరు వర్గాలకు చెందిన వారు రాజీ ప్రయత్నాలు చేశారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించినట్లు తెలిసింది.

ఉపాధిహామీలో అతనే డాన్

ఆయన ఉపాధి హామీ కార్యాలయంలో జూనియర్ ఇంజినీర్. ఆయన చెప్పిందే వేదం, చేసిందే శాసనం. ఎవరైనా అడ్డు వస్తే కార్యాలయం నుంచి పంపించే వరకు నిద్రపోడు. రెండేళ్లలో ఉపాధిహామీ కార్యాలయంలో ఏపీవో పోస్ట్ లేకుండా శాసిస్తున్నాడు. అవెన్యూ ప్లాంటేషన్ పేరిట రూ.10 లక్షల వరకు స్వాహా చేశాడన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి నేతలతో జతకట్టి ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాడు. ఆయన వ్యవహారం తెలిసినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

- అవెన్యూ ప్లాంటేషన్ పేరిట రూ.10 లక్షలు స్వాహా
- పెత్తనం చెలాయిస్తున్న జూనియర్ ఇంజినీర్
- పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు


గుడిపాల: పల్లూరు–చిత్తపార రోడ్డు పక్కన కనిపించని మొక్కలు

గుడిపాల : మండలంలోని ఉపాధిహామీ కార్యాలయానికి మూడున్నరేళ్ల క్రితం జూనియర్ ఇంజినీర్‌గా మధు అనే వ్యక్తి బదిలీపై వచ్చాడు. అంతకుముందే కార్యాలయంలో ఏపీవో, ముగ్గురు ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. ఇతను రావడంతో ఏపీవోతో పాటు ఇద్దరు టీఏలు కూడా ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇతనికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. అంతా తానేనన్నట్టు వ్యవహరిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అవెన్యూ ప్లాంటేషన్ (రోడ్డు పక్కన మొక్కలు నాటడం) కార్యక్రమాన్ని మొదలు పెట్టాడు. ఇందులో సుమారు రూ.10 లక్షల వరకు స్వాహా చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. గుడిపాల మండలంలోని మందిక్రిష్ణాపుర, వయా గొల్లమడుగు రోడ్డు పక్కన మొక్కలు నాటినట్టు చూపించి బిల్లులు స్వాహా చేశాడు. తన బంధువు పేరిట బ్యాంక్ ఖాతాలో రూ.1,22,688 జమ చేసుకున్నాడు. అలాగే పానాటూరు వయా చిత్తపార రోడ్డులో మొక్కలు నాటినట్టు చూపించి వర్క్ ఐడీ నంబర్ 70275తో మరో రూ.1,22,650లను స్వాహా చేశాడు. అలాగే 197రామాపురం, నారగల్లులోని శివన్‌మల్లై రోడ్డుకు మట్టి పోసినట్లు లెక్కలు చూపి రూ.1.63 లక్షలను తన వద్ద పనిచేసే డ్రైవర్ ఖాతాకు జమ చేశాడు. మందిక్రిష్ణాపురం వద్ద ఏర్పాటుచేసిన విలేజ్ పార్క్‌లో తూతూమంత్రంగా పనులు చేసి రూ.1,13,330లు స్వాహా చేశాడు. కమ్మతిమ్మపల్లె నుంచి తమిళనాడు సరిహద్దు వరకు మొక్కలు నాటినట్టు రూ.25,800 బిల్లు చేసుకుని తన కుమారుడి ఖాతాలో జమ చేసుకున్నాడు. దీంతో పాటు ఫిష్ పాండ్ పనులను జేసీబీలతో చేయించి బిల్లులు స్వాహా చేసినట్లు సమాచారం.


సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకం

శిలాఫలకాల నిధులు కూడా స్వాహా

గత సంవత్సరం గుడిపాల మండలంలో ఉన్న 27 పంచాయతీల్లో 24 పంచాయతీల్లో నా భూమి–నా దేశం శిలాఫలకాలు ఏర్పాటుచేశారు. ఇందుకుగాను ఒక్కో పంచాయతీకి రూ.6996లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని గత సంవత్సరం ఆగస్టులో ఆయా సర్పంచులు, ఎంపీటీసీలు ఏర్పాటు చేశారు. వీటికి నిధులు మంజూరైనా ఎవరికీ ఇవ్వకుండా తన ఖాతాలో జమ చేసుకున్నాడు. ఇంతవరకు బిల్లులు మంజూరు కాలేదని చెబుతున్నాడు.

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు

తన బాగోతం బయట పడుతుందనే నెపంతో కూటమి నేతలతో కలిసి గుడిపాల మండలంలోని ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాడు. తమను ఎందుకు తొలగిస్తున్నారో చెప్పాలని ఫీల్డ్ అసిస్టెంట్లు కోరినా ఫలితం లేదు. కూటమి నేతలకు అనుకూలంగా ఉన్న వారిని నియమించుకుని యథేచ్ఛగా అవినీతికి పాల్పడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా మూడు నెలల క్రితమే ఆడిట్ జరగాల్సి ఉంది. జూనియర్ ఇంజినీర్ తన పలుకుబడిని ఉపయోగించి ఆడిట్ జరగకుండా ఆపించారని విమర్శలున్నాయి.

సంవత్సరం దాటినా బిల్లులు ఇవ్వలేదు



గత సంవత్సరం ఆగస్టులో చిత్తపార సచివాలయంలో నాభూమి–నాదేశం శిలాఫలకాన్ని ఏర్పాటు చేయమని తెలిపారు. వాటిని ఏర్పాటు చేస్తే రూ.6996 ఇస్తామన్నారు. ఇంతవరకు బిల్లు ఇవ్వలేదు. అన్ని మండలాల్లో బిల్లులు ఇచ్చేశారు. ఇక్కడ మాత్రం ఇవ్వలేదు. అడిగితే జూనియర్ ఇంజినీర్ మధు ఇంతవరకు రాలేదని చెబుతున్నాడు. బిల్లులు వచ్చేసినా కూడా ఇవ్వకుండా తన ఖాతాలో వేసుకుని తిప్పిస్తున్నాడు.

– రవియాదవ్, మాజీ సర్పంచ్, చిత్తపార

విచారణ చేయిస్తాం

నా భూమి–నాదేశం శిలాఫలకాల ఏర్పాటు బిల్లుల అందని విషయం నా దృష్టికి రాలేదు. ఉపాధి హామీ జూనియర్ ఇంజినీర్ అక్రమాలపై విచారించి నిజానిజాలు వెలికి తీసి ఉన్నతాధికారులకు నివేదక అందజేస్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– ఉపేంద్ర, ఎంపీడీవో

చిత్తూరులో పట్టపగలే చోరీ

చిత్తూరు అర్బన్: చిత్తూరులో పట్టపగలే ఓ ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీచేశారు. చిత్తూరులోని ఎస్బీఐలో పనిచేస్తున్న ఇర్ఫాన్ తన ఇంటి వద్ద తెలిసిన వాళ్లతో మాట్లాడు తున్నాడు. ఆ సమయంలో గుర్తుతెలియని మహిళ లోనికి చొరబడి సుమారు రూ.4 లక్షల బంగారు, వెండి ఆభరణాలు, రూ.3 వేల నగదు మొత్తం చోరీచేసి పారిపోయింది. వన్ టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

కాపర్ వైర్ చోరీ

వెదురుకుప్పం: మండలంలోని బ్రాహ్మణపల్లెలోని బండి క్రిష్ణారెడ్డి పొలంలో ఉన్న 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్లను శనివారం రాత్రి దుండగులు చోరీ చేశారు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతు క్రిష్ణారెడ్డి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించాడు. కాపర్ వైర్ రూ.30 వేలు ఉంటుందని పేర్కొన్నాడు. తమకు న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నాడు.

డెంగీతో బాలిక మృతి

వి.కోట: మండల కేంద్రమైన వి.కోటలో వారం రోజులు కూడా గడవక ముందే డెంగీతో మరో బాలిక మృతిచెందింది. పట్టణంలోని బాపూజీ వీధికి చెందిన సిద్దిక్ కుమార్తె ఫాతిమా (3) జ్వరంతో బాధపడుతుండడంతో ఈ నెల 18న వి.కోట పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అనంతరం పలమనేరులో ఉన్న చిన్నపిల్లల డాక్టర్ వద్దకు వెళ్లారు. జ్వరం తగ్గకపోవడంతో కుప్పం పీఈఎస్‌కు తరలించారు. అక్కడి నుంచి తిరుపతి రుయాకు వెళ్లారు. అక్కడ కూడా జ్వరం అదుపులోకి రాకపోవడంతో వేలూరు సీఎంసీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం బాలిక మృతి చెందింది. మంగళవారం పట్టణంలోనే మేఘన అనే బాలిక డెంగీతో మృతిచెందింది. వారం తిరగకుండానే మరో బాలిక మృత్యువాత పడడం మండల వాసులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. డెంగీపై అధికారులు అవగాహన కల్పించకపోవడంతోనే రెండు ప్రాణాలు బలయ్యాయని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జిల్లా వైద్యాధికారి వెంకట్రావ్, జిల్లా, మండల వైద్యబృందం ఫాతిమా ఇంటి పరిసరాలను పరిశీలించారు.


బాలిక మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు


మృతి చెందిన ఫాతిమా